క్లుప్తంగా

పాఠ్యపుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటరెడ్డి

పోలవరం రూరల్ : పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం విషయంలో నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండలం కొంద్రుకోట పునరావాస కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాల వసతులపై ఆరా తీశారు. విద్యార్థుల సంఖ్య ఎంత, రోజూ వస్తున్నారా అనే విషయాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణరావు నుంచి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో జి.శ్రీను, వైస్ ఎంపీపీ మిడియం సింగరాజు, ఎంపీటీసీ ఆనంద్, సర్పంచ్ పైదా నాగరాజు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత బాబ్జికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఈఓ త్రినాధరావు

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు వైఎస్సార్ సీపీ నేత, జంగారెడ్డిగూడెం జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి శనివారం రూ. 51,516 విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ విరాళాన్ని తన తాతయ్య, అమ్మమ్మ పారేపల్లి సత్తిరాజు, కాంతమ్మల పేరున ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాత బాబ్జికి ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు విరాళం బాండ్ పత్రాన్ని అందించి, అభినందించారు. ఆయన వెంట మద్ది ఆంజనేయ స్వామివారి ఆలయ ఈఓ కొండలరావు, పోల్నాటి రాజ, రాజు తదితరులున్నారు.

ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు



ద్వారకాతిరుమల : ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు



జంగారెడ్డిగూడెం : సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



బుట్టాయగూడెం : ఎస్ఆర్పాలెంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు చేరుతున్నాయని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని లైన్ గోపాలపురంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు, కౌలు, రేషన్ కార్డులను అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే పథకాలు అందేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అర్హత ఉండి పథకాలు అందనివారిని గుర్తించి, వారికి సంక్షేమ ఫలాలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, గ్రామ సర్పంచ్ పెద్దిన దిలీప్, ఎంపీటీసీ కొప్పిశెట్టి గంగ, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, సచివాలయాల మండల కన్వీనర్ భోగరాజు సాయి కృష్ణ, బొండాడ వెంకన్నబాబు, మండల కోఆప్షన్ సభ్యుడు భాషా, సొసైటీ చైర్‌పర్సన్లు భోగరాజు చిన్ని, గుర్రాల లక్ష్మణ్, డీసీఎంఎస్ డైరెక్టర్ జేవీ కృష్ణారెడ్డి, బాలం వెంకటేశ్వరరావు, పెండ్యాల విజయ్, తహసీల్దార్ పి.సతీష్, ఎంపీడీఓ ఏవీ సుబ్బరాయన్ తదితరులున్నారు.

ప్రజలకు చేరువగా సేవలు

జంగారెడ్డిగూడెం : పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన మార్పులు ప్రజలను పేదరికం నుంచి బయటపడేస్తున్నాయని మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు అనుసరించిన విధానాలకు భిన్నంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేశారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం ఎక్కడికి తిరగాల్సిన పనిలేకుండా ఇంటి వద్దకే వచ్చి చేరుతున్నాయన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షులు పీపీఎన్ చంద్రరావు, పట్టణ సచివాలయాల కన్వీనర్ చనమాల శ్రీనివాస్, ఐసీడీఎస్ రీజనల్ చైర్మన్ వందనపు సాయిబాలపద్మ, పార్టీ జిల్లా యూత్ అధ్యక్షులు గిరిబాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు వరం

లింగపాలెం : జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు వరమని, ఈ కార్యక్రమంతో ప్రజాసమస్యలు పరిష్కారంతోపాటు, నాణ్యమైన సేవలు ఉచితంగా అందుతున్నాయని వైస్ ఎంపీపీ మట్టా సురేష్‌బాబు అన్నారు. శనివారం నరసన్నపాలెం సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం అర్హులకు వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కూరపాటి రత్తయ్య, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత మునునూరి వెంకటేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారి ఏవీఆర్ గంగాధరబాబు, తహసీల్దార్ మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు మందలపు నరశింహరావు, యలమంచి సత్తాబాబు, రావి కొండయ్య, కటికినేని రఘు, కర్లపూడి ఆనంద్, ముళ్లపూడి సుమన్, అధికారులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

పోలవరం రూరల్ : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండలం కొంద్రుకోట సచివాలయం పరిధిలో పునరావాస కేంద్రంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన అందిస్తున్న జగనన్నకు వచ్చే ఎన్నికల్లో సైతం ఓటు వేసి మరోసారి సీఎంగా గెలిపించుకోవాలన్నారు. లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.శ్రీను, మండల ఉపాధ్యక్షులు మిడియం సింగరాజు, సర్పంచ్ పైదా నాగరాజు, ఎంపీటీసీ మాడే ఆనంద్, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్ఆర్పాలెంలో సురక్ష

బుట్టాయగూడెం : మండలంలోని నూతిరామన్నపాలెంలో శనివారం సర్పంచ్ పొడియం లక్ష్మి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 750కు పైగా సర్టిఫికెట్‌లను అర్హులైన వారికి ఉచితంగా పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి గగ్గులోతు మోహన్‌రావు, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణల చేతుల మీదుగా సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. అలాగే మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంఈఓ బాబూరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పొడియం లక్ష్మణరావు, బానోతు కృష్ణ నాయక్, పెంటపాటి శ్రీను, పేలం దుర్గారావు, కిరణ్, కుర్సం ప్రసాద్, బానోతు శ్రీరామ్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష విజయవంతం

బుట్టాయగూడెం : ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమం పూర్తి విజయవంతమైందని జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు తెలిపారు. శనివారం సాయంత్రం ఎస్ఆర్పాలెంలో వారు విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 1వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ అన్ని సచివాలయాల పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష సభలకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని అన్నారు. కార్యక్రమ విజయవంతానికి సహకరించిన ప్రజలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్‌లు పొడియం లక్ష్మి, తెల్లం వెంకాయమ్మ, మడకం రామలక్ష్మి, సరియం లక్ష్మి, రవ్వా చంద్రకళ, పెడకం విజయలక్ష్మి, ఉయికే బొజ్జి, కుంజా వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ గాలి దుర్గారావు, పార్టీ నాయకులు రవ్వా నాగు, తెల్లం దేవరాజు, సరియం చల్లయ్య, సోదెం సుధాకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు



రామానుజపురంలో గర్భిణులను ఆశీర్వదిస్తున్న బాలరాజు

కొయ్యలగూడెం : రాష్ట్ర అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. రామానుజపురం గ్రామంలో శనివారం ఎంపీడీవో ఆర్.బేబీ శ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. నీతి అయోగ్ వంటి జాతీయ అత్యున్నత సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో పేదరిక నిర్మూలన గణనీయంగా తగ్గింది అని సర్వేలతో సహా పేర్కొంటే దానిని ప్రతిపక్షాలు, వారి అనుకూల మీడియా ఎక్కడ ప్రస్తావించకపోవడం సిగ్గుచేటు అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ రాష్ట్ర అభివృద్ధిని ఇతర రాష్ట్రాల వారు గుర్తించగలిగారే కానీ, ఇక్కడున్న ప్రతిపక్షాలు కళ్లుండి చూడలేని కబోదులుగా మారారని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా రూ. 33 లక్షలతో 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన తాగునీటి వాటర్‌ట్యాంకు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీమంత కార్యక్రమంలో పాల్గొని గర్భిణులను ఆశీర్వదించారు. ఎంపీపీ గంజిమాల రామారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, సర్పంచ్ అడప నాగలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు చిల్లర రామారావు, ఎంపీటీసీ సుంకర రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సదుపాయాలను వినియోగించుకోండి



పాఠశాలలో భోజనాలను పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

చింతలపూడి : ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు అన్నారు. మండలంలోని నాగిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. వంట శాలతో పాటు పిల్లలకు పెడుతున్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బాలికలను సమస్యల గురించి అడుగగా పాఠశాల చుట్టూ ఉన్న ప్రహరీ గోడ ఎత్తు పెంచాలని, మరుగుదొడ్లు మరమ్మతులు చేయించాలని, భోజనశాల సరిపోవడం లేదని జడ్జి దృష్టికి తీసుకువచ్చారు.

ఫుడ్ కమిషన్ మెంబర్ తనిఖీ

నాగిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠశాలను ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. బియ్యం, కూరగాయలు, నిత్యవసర సరుకుల నాణ్యతను పరిశీలించారు. స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిచేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని పిల్లలకు పెట్టే ఆహారం విషయంలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు ఉన్నారు.

పాఠశాలలను పరిశీలించిన ఎస్సై

టి.నరసాపురం : విద్యార్థులు పూర్తి భద్రత, స్వేచ్ఛతో విద్యను అభ్యసించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, విద్యార్థులు బాగు చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎస్సై కె.సతీష్‌కుమార్ అన్నారు. మర్రిగూడెం ప్రభుత్వ ఆశ్రమ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాలలను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం ఎస్సై సతీష్ కుమార్ సందర్శించారు. మర్రిగూడెం గిరిజన బాలికల పాఠశాలకు శాశ్వత వాచ్‌మన్ లేరని గుర్తించారు. ఎస్సై వెంట కానిస్టేబుల్ రమేష్ ఉన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్ : శ్రీనివాసపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రహదారి పనులను ఆయన పరిశీలించారు. ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, వార్డు సభ్యులు వసంతాటి సతీష్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు పోల్నాటి రాజా, సిర్రా రాజేష్ పాల్గొన్నారు.

ఎంపీకి కృతజ్ఞతలు తెలిపిన వర్జీనియా రైతులు

జంగారెడ్డిగూడెం రూరల్ : ఏలూరు ఎంపీ శ్రీధర్‌కి వర్జీనియా పొగాకు రైతులు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. వడగళ్ల వర్షానికి ఎస్ఎల్ఎస్ పరిధిలో వర్జీనియా పొగాకు రైతులు నష్టపోవడంతో అదనంగా పండిన పొగాకుకు పెనాల్టీ విధించకుండా అమ్మకాలు చేపట్టేలా ఎంపీ చొరవ చూపడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పునరావాసం కల్పించాలి

కుక్కునూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించకుండా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు వెంటనే పునరావాసం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ రవి శనివారం ఓ ప్రకటనలో కోరారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరావాస పరిహారాన్ని పూర్తిగా చెల్లించి నిర్వాసితులను పునరావాసం కేంద్రాలకు తరలించాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్‌కు ఆహ్వానం

ఏలూరు (మెట్రో) : ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడల గ్రామోత్సవం నిర్వహణలో భాగంగా సంస్థ నిర్వాహకులు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శనివారం ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఆగస్టు 12, 13 తేదీల్లో జంగారెడ్డిగూడెంలోని సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో వాలీబాల్(పురుషులకు), త్రోబాల్(స్త్రీలకు) జిల్లా స్థాయిలో మ్యాచ్‌లను జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వారి సహకారంతో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వికాస్, పీఎస్ఆర్ చరణ్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. విజేతలు కేలో ఇండియా సర్టిఫికెట్, ప్రైజ్ మనీని అందుకుంటారన్నారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి రిజిస్ట్రేషన్ తప్పనిసరని, వివరాలకు 83000 30999, 80504 53299 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అర్హులకు నేరుగా సంక్షేమ లబ్ధి



చింతలపూడి : వెంకటాద్రిగూడెంలో బ్రోచర్ అందచేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా



కొయ్యలగూడెం : బయ్యన్నగూడెంలో బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

చింతలపూడి : రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా తెలిపారు. చింతలపూడి మండలం, వెంకటాద్రిగూడెం సచివాలయం పరిధిలో శనివారం త్సల్లాబత్తుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి అందిన లబ్ధిని చదివి వినిపించి బుక్‌లెట్లు అందచేశారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, పి.భాస్కర్రావు, రాజారమేష్, తాండ్ర రామకృష్ణారావు, కుప్పాల రామకృష్ణ, ఎ.సుబ్బారావు, ఎస్.దుర్గారావు, కొప్పుల నాగేశ్వరరావు, జంగా చెన్నకేశవరెడ్డి, యువరాజు, అలవాల బాబు, జైపాల్, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే ప్రజారంజక పాలన

కొయ్యలగూడెం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. శనివారం బయ్యన్నగూడెం గ్రామంలో వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మిల ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో విస్తరింపబడిన జాతీయ ప్రధాన రహదారి నిర్మాణంలో అవకతవకలు జరిగాయని ప్రజలు ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా రోడ్డుకి ఇరువైపులా నిర్మిస్తున్న డ్రెయినేజీ నిర్మాణంలో నిబంధనలు పాటించలేదని, డివైడర్ నిర్మాణంలో కూడా పంచాయతీ తీర్మానాన్ని పట్టించుకోలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కంభంపాటి బుజ్జిబాబు, ఉప సర్పంచ్ కోరుకొండ లలిత, మద్దిపాటి శ్రీను, బాలం సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కుక్కునూరు : మణిపూర్‌లో ఇద్దరు గిరిజన యువతులను నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారం చేసి హత్య చేసిన మృగాలను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ). కుక్కునూరు మండల కార్యదర్శి వరకా శ్యామల డిమాండ్ చేశారు. శనివారం కుక్కునూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రపతి గిరిజన మహిళగా ఉండి గిరిజన యువతులపైన జరిగిన అఘాయిత్యంపై నోరు విప్పకపోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య కుక్కునూరు మండల నాయకురాలు కొన్నె జయశ్రీ మహిళా సమాఖ్య కుక్కునూరు మండల నాయకురాళ్ళు వరసా లక్ష్మి, సోడె వెంకటమ్మ, సుశీల పాల్గొన్నారు.

పోలవరం రూరల్ : మణిపూర్‌లో ఇద్దరు గిరిజన యువతులపై చోటు చేసుకున్న ఘటన సిగ్గుచేటని, ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం నాయకులు పేర్కొన్నారు. శనివారం పోలవరంలో ర్యాలీ నిర్వహించి, రెవెన్యూ కార్యాలయంలో దోషులను శిక్షించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఏటిగట్టు సెంటర్‌లో ధర్నా నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

బుట్టాయగూడెం : మణిపూర్‌లోని హింసాత్మక ఘటనలకు నిరసనగా సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం బుట్టాయగూడెంలో ర్యాలీ, ధర్నా చేశారు. ఏఐకేఎమ్ఎస్ జిల్లా నాయకులు కారం రాఘవ అధ్యక్షతన జరిగిన సభలో ఏఐకేఎమ్ఎస్ నాయకులు పోరంట్ల శ్రీనివాస్, ఇఫ్టూ నాయకులు కేవీ రమణ, ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండపై కేంద్రం జోక్యం చేసుకోకుండా నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుందని అన్నారు.

సెల్‌టవర్ల వద్ద జనరేటర్ల ఏర్పాటు

కుక్కునూరు : గోదావరి వరదల దృష్ట్యా సెల్ టవర్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు జనరేటర్లు సిద్ధం చేసినట్టు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్ రాజ్ శనివారం తెలియజేశారు. వేలేరుపాడు మండలం జగన్నాధపురంలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌కు 7.5 కేవీఏ జనరేటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. కోయిదా, టేకూరు గ్రామాల్లో రెండు 7.5 కేవీఏ జనరేటర్లు అందుబాటులో ఉంచామన్నారు. 5 కేవీఏ సామర్థ్యంగల 5 జనరేటర్లను తణుకు నుంచి తెప్పించామన్నారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరాలో ఇబ్బందులులేవన్నారు.

దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన

కుక్కునూరు : గతేడాది జూలైలో గోదావరి వరదల కారణంగా కూలిన ఇళ్లను శనివారం నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పరిశీలించారు. ఇళ్లులు కూలి నష్టపోయిన బాధితులు కొందరికి పరిహారం జమకావడంతో ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. నష్టపరిహారపు జాబితాను అధికారులు తహసీల్దార్ కార్యాలయానికి పంపడంతో సబ్ కలెక్టర్ ఆ ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. జాబితాలో ఉన్న పేర్లను స్థానిక సర్పంచ్ ద్వారా ఎంక్వైరీ చేయించి ధ్రువీకరించాలని సెక్రటరీని ఆదేశించారు.

అంటువ్యాధులు సోకకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

పోలవరం రూరల్ : వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో అంటువ్యాధులు సోకకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి సిబ్బందికి సూచించారు. పోలవరం మండలంలోని కుంకాల, సరిపల్లికుంట, మనుగోపుల గ్రామాల్లో నిర్వహిస్తున్న మలాథీయన్ రెండవ విడత స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని ఆమె శనివారం పరిశీలించారు. ఇంటి లోపల, ఇంటి చుట్టూ మలాథీయన్ స్ప్రేయింగ్ చేయించుకోవాలని ప్రజలకు తెలియజేశారు. పోలవరం మలేరియా సబ్‌యూనిట్ అధికారి బి.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ, ఇద్దరు చిన్నారుల అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : మహిళ, ఇద్దరు చిన్నారుల అదృశ్యంపై కేసు నమోదైంది. తన భార్య రాజేశ్వరమ్మ గ్రామంలోని పాఠశాలలో 4, 5 తరగతులు చదువుతున్న లక్ష్మి సిరిన్, ఇనోక్ ఈ నెల 21 నుంచి కనిపించడం లేదని పంగిడిగూడేనికి చెందిన జి.రామదాసు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు.

మోటార్ సైకిల్ చోరీపై..

పట్టణంలో మోటార్‌సైకిల్ చోరీపై కేసు నమోదైంది. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ బస్టాండ్‌లో ఇన్‌గేట్ వద్ద తన గ్లామర్ మోటార్‌సైకిల్ పార్క్ చేసి బస్టాండ్‌లో పని చూసుకుని వచ్చి చూసేసరికి కనిపించలేదని తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట మండలం పేరాయిగూడెంకు చెందిన తగరం కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు.

ఏడుగురిపై కేసు నమోదు

ఒక వ్యక్తిని గాయపర్చిన ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు స్టేషన్ రైటర్ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం పెదవేగి మండలం వేగివాడకు చెందిన యర్రంశెట్టి అయ్యప్పస్వామి, మరికొందరు ఈ నెల 20న గుబ్బలమంగమ్మ గుడికి వెళ్లారు. ఈ నేపథ్యంలో అయ్యప్పస్వామితో అదే గ్రామానికి చెందిన బెజవాడ నరేంద్ర గొడవపడ్డాడు. తిరుగు ప్రయాణంలో స్థానిక ఆర్డీవో కార్యాలయానికి వచ్చేసరికి అయ్యప్పస్వామిని వ్యాన్ నుంచి కిందకు దింపి నరేంద్ర, మరో ఆరుగురు తీవ్రంగా కొట్టి గాయపర్చడంతో బాధితుడు స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కడుపు నొప్పి తాళ్లలేక ఒక వ్యక్తి కలుపు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. ద్వారకాతిరుమలకు చెందిన పారపల్లి శ్రీను కొంతకాలంగా తాపీ పనిచేస్తూ జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్నాడు. ఇతను కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ నెల 16న తీవ్రంగా కడుపునొప్పి రావడంతో పారిజాతగిరి కొండవద్ద కలుపుమందు సేవించడంతో స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం ఏలూరు అనంతరం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 22న మృతిచెందినట్లు తెలిపారు. శ్రీను తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

వ్యక్తిని కొట్టి గాయపర్చిన నేరంపై కేసు నమోదు చేసినట్లు రైటర్ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శ్రీనివాసపురానికి చెందిన కేదాసు శేషారత్నంకు చెందిన పూలమొక్కలను బల్లే వెంకటేశ్వరరావుకు చెందిన మేకలు తిన్నాయి. దీంతో శేషారత్నం మొక్కలను మేకలు తినేశాయని తిట్టుకుంటుండగా బల్లె వెంకటేశ్వరరావు కర్రతో ఆమెను కొట్టి గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఏరియా ఆసుపత్రిలో విజిలెన్స్ తనిఖీలు

స్థానిక ఏరియా ఆసుపత్రిలో శనివారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రి నిర్వహణ, వైద్యులు, సిబ్బంది హాజరు, వ్యర్థాల నిర్వహణ, మందులు తదితర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. విజిలెన్స్ సీఐ యూజే విల్సన్ మాట్లాడుతూ పోస్టుమార్టం షెడ్డు వద్ద పరిశుభ్రత పాటించడం లేదని తెలిపారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి, జీలుగుమిల్లి పీహెచ్‌సీ, ఆచంట ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్ ఆధ్వర్యంలో సీఐ డీజే విల్సన్, ఏఈ శ్రీనివాసరావు, ఏజీ శ్రీధర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

ఎద్దును రక్షించారు

వేలేరుపాడు : ప్రమాదవశాత్తు బావిలో పడిన ఎద్దును ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. మండలంలోని బొళ్లపల్లి గ్రామంలో మేత మేసేందుకు వెళ్లిన ఎద్దు ప్రమాదవశాత్తు బావిలో పడిపోయింది. గోదావరి వరద సహాయక చర్యల్లో పాల్గొంటున్న ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బందికి స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న వారు నిచ్చెన సహాయంతో బావిలోకి దిగి, తాళ్లు కట్టి ఎద్దును పైకి లాగి కాపాడారు. ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బందికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి కె.శ్రీనివాసరావు, కేంద్ర అగ్నిమాపక అధికారి అబ్రహం, అగ్నిమాపక, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.